క్లుప్తంగా

వేములదీవి వెంకన్నకు ప్రత్యేక పూజలు



నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి కాపులకొడప వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్ కుమార్ ఆచార్యులు వేకువజాము నుంచే స్వామి వారికి విశేష సేవలు చేసి అభిషేకాలు, పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుడు రూపచక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రజనీకుమార్

పాలకొల్లు సెంట్రల్: ప్రతి విద్యార్థీ బాధ్యతాయుతమైన పౌరుడిగా ఎదగాలని పట్టణ సీఐ కోలా రజనీకుమార్ అన్నారు. శనివారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు వినియోగ వ్యతిరేక చట్టం అనే అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రజనీకుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత చెడు వ్యసనాల జోలికి పోకుండా బాధ్యతాయుతంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీకే మల్లేశ్వరరావు, ఎస్సై జి.పృథ్వీ, ఏఎస్సై మార్‌లింగం, అధ్యాపకులు రమణకుమార్, బీవీఎస్ రమణ తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం తక్షణం అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి అప్పలస్వామి

పెనుగొండ: తల్లి వందనం ఇంకా కొంత మంది విద్యార్థులకు చెల్లించాల్సి ఉందని, వారికి తక్షణం చెల్లించాలని ఆలిండియా స్టూడెంట్స్ అసోషియేషన జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి డిమాండ్ చేశారు. పెనుగొండలో కళాశాల విద్యార్థులతో తల్లికి వందనం పథకంపై మాట్లాడారు. తల్లికి వందనం రూ.15 వేలుకు బదులు రూ.13వేలే జమ చేసి మోసం చేశారని ఆరోపించారు, అదేవిధంగా అర్హత జాబితాలో పేర్లు ఉన్నా కొంతమందికి నేటికీ జమ చేయలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 87 లక్షల 41 వేల మందికి విద్యార్థులకు అర్హత ఉండగా, కూటమి ప్రభుత్వం 67 లక్షల 27 వేల మందికి మాత్రమే జమ చేసిందన్నారు. ఇంకా దాదాపు 20 లక్షల మంది విద్యార్థులకు జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.సురేష్, బి.యశ్వంత్, పి.ఫణి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

భీమవరం: స్థానిక మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవాకేంద్రంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు ప్రారంభిస్తారని ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరంలో న్యూరాలజీ, బీపీ, షుగర్ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. అనంతరం గరగపర్రు గ్రామంలోని వసుధ వాత్సల్య నిలయంలో స్వచ్ఛంద సంస్థలకు ఆర్థిక సహాయం అందిస్తారని పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో సమస్యలు

ట్రాఫిక్ ఇబ్బందులు వస్తాయంటున్న వాహనదారులు



రోడ్డు మార్జిన్‌లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ



టాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు మున్సిపల్ అధికారులు చూపించిన ప్రాంతం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని మయూరి లాడ్జి సెంటర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు వివాదానికి దారి తీస్తుంది. మున్సిపల్ అధికారులు సూచించిన స్థలంలో దాని పక్కనే రోడ్డు మార్జిన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు విద్యుత్ శాఖ అధికారులు దిమ్మ ఏర్పాటు చేయడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని మయూరి లాడ్జి ఎదురుగా ఉన్న మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌కు, చిన్నకార్ల స్టాండ్ ఎదురుగా ఉన్న మునిసిపల్ కాంప్లెక్స్‌లకు వెనుక భాగంలో ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. ఈ షాపింగ్ కాంప్లెక్స్ మధ్యలో కొంత వరకూ మునిసిపల్ ఖాళీ స్థలం ఉంది. దానిలో ఓ బార్ యజమాని కొంతకాలం క్రితం అనధికార నిర్మాణం చేయడం వల్ల అక్కడున్న ఖాళీ స్థలం మరింత చిన్నదిగా తయారైంది. దీనిపై గతంలో ఎన్ని అభ్యంతరాలు ఉన్నా ఏ మునిసిపల్ అధికారులు పట్టించుకోలేదు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణం వల్ల అక్కడున్న మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో వ్యాపారస్తులకు పార్కింగ్ స్థలం లేకుండా పోతుందని వాపోతున్నారు. రోడ్లు చిన్నవి కావడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది అవుతుందని స్పష్టం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

మయూరి లాడ్జ్ ప్రాంతంలో ఉన్న ఆ కాస్త ఖాళీ స్థలంలో విద్యుత్ శాఖ అధికారులు ఓ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి సమాయత్తమయ్యారు. పిల్లర్స్ వేసి దిమ్మ కూడా ఏర్పాటు చేశారు. ఇంకా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ సముదాయంలో సుమారు 20 వరకూ షాపులు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏరాటుచేస్తున్నామని స్థానికంగా ఏ అభ్యంతరం లేదని అక్కడున్న మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో వ్యాపారస్తులు కొందరితో సంతకాలసేకరణ చేయించినట్లు తెలిసింది. కొందరు వ్యాపారస్తులు సంతకాలైతే చేశారు గానీ ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కడ ఏర్పాటు చేస్తారో? తెలుసుకోకుండా సంతకాలు పెట్టామని వాపోతున్నారు. బార్‌షాపు అదనపు నిర్మాణం చేసిన గోడకు చేర్చి (బల్ల ఉన్న ప్రాంతంలో) పెడతారేమో? అనే ఆలోచనలో స్థానిక వ్యాపారస్తులు అనుకున్నారు. తీరా దిమ్మను నిర్మాణం చేసిన తరువాత ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారని తెలిసింది. దానితో ఇక్కడైతే ట్రాఫిక్‌కు ఇబ్బంది అవుతుందని కాంప్లెక్స్ వ్యాపారస్తులు వాపోతున్నారు. ఇక్కడ కాంప్లెక్స్ రోడ్డు బాగా చిన్నదని, ఈ షాపుల్లో మెకానిక్, పొండ్రీ, ఫైనాన్స్ షాపులు ఎక్కువగా ఉన్నాయి. ఏదైనా వాహనం వస్తే ఎక్కడ పార్కింగ్ చేసుకోవాలి? అని ప్రశ్నిస్తున్నారు.

ఏర్పాటు కుదరడం లేదంటున్న విద్యుత్ అధికారులు

ఈ విషయంపై విద్యుత్ శాఖ అధికారులను ప్రశ్నిస్తే మునిసిపల్ అధికారులు చూపించిన ప్రాంతంలో అంటే బల్ల ఉన్న ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని అనుకున్నామని, అక్కడ కుదరడం లేదు. ముందుగా అక్కడే ప్రయత్నం చేశామని కానీ తీగలు, రాడ్లు మలుపు తిప్పడానికి ఇబ్బంది అవుతుందని రోడ్డు మార్జిన్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ వేరే చోటుకు మార్చాలి

మా షాపునకు ఎదురుగానే ట్రాన్స్‌ఫార్మర్ నిర్మిస్తున్నారు. షాపునకు వచ్చే కస్టమర్ల ద్విచక్ర వాహనాలు, ఫైనాన్స్ చేయించుకునే వాహనాలు ఇక్కడ పార్కు చేస్తే మరో వాహనం వెళ్లే మార్గం ఉండదు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ వేరే ప్రదేశానికి మారిస్తే బాగుంటుంది.

– వై.పద్మారావు, ఫైనాన్స్ వ్యాపారి

పార్కింగ్‌కు ఆ స్థలం వదలాలి

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు కొందరితో సంతకాలు చేయించుకున్నట్లు తెలిసింది. మాకు ముందుగా తెలిసినా మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేసేవాళ్లం. మేము ఇంకా ఈ స్థలాన్ని పార్కింగ్ కింద వదిలేయాలని మునిసిపల్ అధికారులను అడగాలనుకున్నాం. ఇంతలో ఇక్కడ దిమ్మ నిర్మాణం చేసేశారు.

– నారాయణ, పొండ్రీ యజమాని

13న జాతీయ లోక్ అదాలత్

నరసాపురం: సెప్టెంబర్ 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశార. రాజీ చేసుకోదగిన కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవడానికి ఇదో మంచి అవకాశమని వివరించారు. అన్ని రకాలు కేసులు రాజీ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారుల్లో అవగాహన కల్పించి లోక్ అదాలత్ విజయవంతమయ్యేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులు, న్యాయవాదులకు సూచించారు.

నేడు అఖిలపక్ష సమావేశం

నరసాపురం: నరసాపురం జిల్లా కేంద్రం కోరుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు మిషన్ హైస్కూల్ రోడ్డులోని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ కార్యాలయంలో అఖిలపక్ష రాజకీయ పార్టీల సమావేశం నిర్వహిస్తున్నట్టు సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు నెక్కంటి సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తీరప్రాంతం జిల్లా కేంద్రం చేయాలనే నినాదంతో ఈ ఉద్యమం చేపట్టినట్టు స్పష్టం చేశారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు , నెగ్గపూడి, వెలగలేరు గ్రామాల్లో రూ.38 లక్షలతో నిర్మించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. నెగ్గెపూడి పంచాయతీ పరిధిలోని వనంపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, డ్రెయిన్ ప్రారంభించారు. అదేవిధంగా ఓడూరు గ్రామంలో రెండు రైతు సంఘాల గ్రూపులకు సబ్సిడీపై రూ.19.60 లక్షలు విలువైన డ్రోన్లను ఆయన అందజేశారు.

మునిపల్లే రాజు సాహిత్యం ఆదర్శనీయం



జాతీయ సదస్సులో ఆవిష్కరణలు చేస్తున్న సలహా మండలి సభ్యులు

పెనుగొండ: మునిపల్లే రాజు కథలు, రచనలు, తరువాత తరం వారికి ఆదర్శనీయమని తెలుగు సాహితీ అకాడమీ సలహా మండలి సభ్యులు మృణాళిని అన్నారు. శనివారం పెనుగొండ ఎస్‌వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో కేంద్ర సాహిత్య అకాడమీ సౌజన్యంతో తెలుగు విభాగం నిర్వహించిన జాతీయ సదస్సులో ఆమె పాల్గొన్నారు. మునిపల్లె కథలను, వారి రచనలను పాఠ్యాంశాలుగా చేర్చాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఐఏఎస్ అధికారి, తెలుగు రచయిత వాడ్రేవు చిన వీరభద్రుడు మాట్లాడుతూ మునిపల్లే రచనల్లో మానవీయ కోణం, ఆత్మ దర్శనం కనిపిస్తుందన్నారు. విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. విద్యార్థి స్థాయి నుంచి పుస్తక పఠనంతో ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు, మునిపల్లే రాజు కుమార్తె కె.లక్ష్మీ ప్రసన్న, కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు టి.నాగిరెడ్డి, సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ కె.రామచంద్రరాజు, సదస్సు కన్వీనరు డాక్టర్ రంకిరెడ్డి రామ్మోహనరావు ఎస్.వర ప్రసాద్, తెలుగు విభాగ అధ్యాపకులు కర్ని సురేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి గంగరాజు

నరసాపురం/నరసాపురం రూరల్: బాల్య వివాహాలు పూర్తిస్థాయిలో అరికట్టాల్సిన అవసరముందని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు సూచించారు. శనివారం కొప్పర్రు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద చిన్నవయస్సులో గర్భం దాల్చితే వచ్చే ప్రమాదాలపై నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. గతంతో పోలిస్తే బాల్య వివాహాల సంఖ్య తగ్గిందని, అయితే ఇంకా పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. బ్యాల వివాహాలు చేసినా, ప్రోత్సహించినా కూడా జరిమానా, జైలు శిక్ష పడతాయని హెచ్చరించారు. సర్పంచ్ వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ఆర్.వరలక్ష్మి, ఎస్.రాజ్యలక్ష్మి, నరసాపురం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వైదాని నాగేశ్వరరావు, ఇంజేటి జాన్ కెనడీ, డాక్టర్ జేరూష తదితరులు పాల్గొన్నారు.

స్థానిక వనరులను వినియోగించుకోవాలి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రొఫెసర్ ఉదయభాస్కర్

పాలకొల్లు సెంట్రల్: స్టార్టప్స్ ద్వారా స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని నూతన వ్యవస్థాపకులుగా ఎదగాలని ప్రొఫెసర్ ఎస్ ఉదయభాస్కర్ అన్నారు. శనివారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంటర్ పెన్యూర్ వర్క్‌షాప్ (కార్యశాల)పై జాతీయస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజమండ్రి ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ ప్రొఫెసర్ ఎస్.ఉదయభాస్కర్ మాట్లాడుతూ వ్యవస్థాపకుడికి ఉండాల్సిన లక్షణాలు, ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ సీసీఈ ఉత్తర్వుల మేరకు ఆవిష్కారంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిలో భాగంగా వన్ కామన్ లెసన్ ఆన్ ఇన్నోవేషన్ స్టార్టప్స్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, ఐసీఐ ప్రెసిడెంట్ టి.కృష్ణ, కె. భద్రాచలం, ఎం.రామకృష్ణ, డా వి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలి

వీరవాసరం: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో బీవీవీ అప్పారావు తెలిపారు. మండలంలోని పలు గ్రామంలోని శనివారం పలు ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధుల్లో ప్రతిరోజు తప్పనిసరిగా పరిశుభ్రపరుస్తూ బ్లీచింగ్ కొట్టాలన్నారు. ప్రజలంతా పంచాయతీ సిబ్బందికి సహకరిస్తూ, వారి వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాలు ఎక్కువగా కురుస్తున్న ప్రస్తుత సమయంలో గ్రామాల్లో పారిశుద్ధ్య సక్రమ నిర్వహణ ద్వారా ప్రజలంతా అనారోగ్యాల బారిన పడకుండా ఉంటారని వివరించారు.

గ్రామాల్లో నిమజ్జనోత్సాహం



ఆకట్టుకుంటున్న రాజీవ్ కాలనీ యూత్ గ్రామోత్సవ వాహనం



ఊసల రామాలయంలో యూత్ ఆధ్వర్యంలో గ్రామోత్సవం చేస్తున్న దృశ్యం

పెనుమంట్ర: మండల కేంద్రమైన పెనుమంట్ర లో శనివారం నాలుగోరోజు గణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పెనుమంట్ర లోని పెంకు టీంటి రామాలయం, ఊసల రామాలయం యూత్, రాజీవ్ కాలనీ కనకదుర్గమ్మ యూత్ ఆధ్వర్యంలో ఒకేసారి గ్రామంలో ఊరేగింపులు, నిమజ్జనోత్సవాలు నిర్వహించడంతో వీధులని గణపతి బప్పా మోరియానినాదాలతో మారుమోగాయి. యువకులు విచిత్ర వేషధారణలు, బుట్ట బొమ్మలు, కోయ డేన్సులు, బేతాళ నృత్యాలు, తీన్మార్ డప్పులు, బాణసంచా కాల్పులతో గ్రామోత్సవం, నిమజ్జనోత్సవం ఘనంగా చేశారు.

ఆకట్టుకున్న శాకాంబరి వినాయకుడు

నరసాపురం: పట్టణంలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద గణేష్ నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రతిరోజూ మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్నారు. రాత్రిపూట ఆధ్యాత్మిక, వినోద కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చినమామిడిపల్లి రామాలయం వద్ద స్థానిక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. 13 ఏళ్లుగా ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. బళ్ల తాతాజీ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



నరసాపురం: చినమామిడిపల్లి రామాలయం వద్ద పూజలందుకుంటున్న వినాయకుడు



గ్రామోత్సవంలో భేతాళ నృత్యాలు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న పెంకుటింటి రామాలయం యూత్ సభ్యులు

యూరియా యాజమాన్య పద్ధతులు వివరించాలి



మాట్లాడుతున్న ప్రాంతీయ సహాయ వ్యవసాయ సంచాలకుడు పీవీవీఎస్ఎస్‌పీ ప్రసాద్

యలమంచిలి: యూరియా వాడకంలో యాజమాన్య పద్ధతులు గురించి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని నరసాపురం ప్రాంతీయ సహాయ వ్యవసాయ సంచాలకుడు పీవీవీఎస్ఎస్‌పీ ప్రసాద్ కోరారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం ఆయన వ్యవసాయ శాఖలో పథకాల గురించి వివరించడానికి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వరి సాగు చేసిన ప్రతి రైతుకు ఈ–పంట నమోదు చేయాలన్నారు. మండల వ్యవసాయాధికారి దుంగా బాల త్రిపుర సుందరి మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు నీటి మునిగిన పొలాలలో నీరు తీసిన వెంటనే 20 కిలోల యూరియా, 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు, వీహెచ్ఏలు, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

ఉల్లి మార్కెట్ ఆకస్మిక తనిఖీ

తాడేపల్లిగూడెం: బ్రహ్మానందరెడ్డి ఉల్లి మార్కెట్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కర్నూలు నుంచి లారీలలో వచ్చిన ఉల్లిపాయలను ఎలా వేలం వేస్తారు. ఎలా క్రయవిక్రయాలు చేస్తారు. గ్రేడింగ్ చేసిన తర్వాత ఎగుమతులు తదితర విషయాలను వ్యాపారులను అడిగితెలుసుకున్నారు. అనంతరం బాదంపూడి చెక్‌పోస్టును ఆకస్మిక తనిఖీ చేశారు. కర్నూలు నుంచి వచ్చే ఉల్లిపాయల లారీల వివరాలను మూవ్‌మెంటు రిజిస్టర్‌లో నమోదుచేయాలని ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ అధికారులు కర్నూలు ఉల్లికి కనీస మద్దతు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మంచినీళ్లు అడిగితే కేసులా?



సమావేశ హాలులో నిరసన తెలుపుతున్న ఆకివీడు నగర పంచాయతీ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, చైర్‌పర్సన్

ఆకివీడు: సిగ్గు, సిగ్గు, నిసిగ్గుగా మంచినీళ్లు అడిగితే కేసులా, ఇది ప్రజాస్వామ్యమా, రాచరికమా? ప్రజల ఇబ్బందుల్ని నిరసన రూపంలో తెలిపినందుకు కేసులా? ఇదేం పాలన అంటూ ఆకివీడు నగర పంచాయతీ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, చైర్‌పర్సన్ నిరసన వ్యక్తం చేయడంతో సమావేశం గంటన్నర సేపు దద్దరిల్లింది. కౌన్సిలర్లు ప్లకార్డులతోనూ, సమావేశ హాలులో బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కౌన్సిలర్ క్షమాపణ చెప్పాలని, కేసులను ఉపసంహరించుకోవాలని, మంచినీళ్లు పూర్తి స్థాయిలో సరఫరా చేయాలని నినాదాలు చేశారు. ఒక దశలో కమిషనర్ కృష్ణమోహన్ కేసుపై వివరణ ఇచ్చేందుకు మైక్‌లో మాట్లాడుతుండగా, కౌన్సిలర్లు పెద్ద ఎత్తున నినాదాలు చేసి సమావేశాన్ని హోరెత్తించారు. కేసు ఫైల్ అయిపోయిందని, నేను చేసేది ఏమీలేదని చెప్పడంతో కౌన్సిలర్లు మండిపడ్డారు. ఇదే తరుణంలో టీడీపీ, జనసేన కౌన్సిలర్లు గతంలో తమ కౌన్సిలర్ భర్తపై ప్రజా సమస్య గురించి అడిగినప్పుడు కమిషనర్ ఇదే విధంగా కేసు పెట్టారని, అప్పుడు ఎందుకు మీరు సహకరించలేదని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, కూటమి కౌన్సిలర్లు సమావేశంలో ఆందోళనకు దిగి బల్లలుగుద్దుతూ కేసు నమోదుపై వ్యతిరేకంగానూ, అనుకూలంగా నినాదాలు చేశారు. సమావేశం నిర్వహించాలని కూటమి కౌన్సిలర్లు పట్టుపట్టినప్పుడు కమిషనర్ కృష్ణ మోహన్ మైక్ తీసుకుని మాట్లాడే ప్రయత్నం చేయగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు నినాదాలు చేశారు. అదే సమయంలో ఆకివీడు ఏఎస్సై సత్యనారాయణ సమావేశ హాలులోకి రావడంతో కౌన్సిలర్లు మండిపడ్డారు. పోలీసులను ఎందుకు పిలిపించారు? మేము దొంగలమా అంటూ అరుపులతో సమావేశ హాల్ మళ్లీ దద్దరిలింది. దీంతో ఏఎస్సై సమావేశ హాలు నుంచి బయటకు వచ్చేశారు. గంటన్నర సేపు జరిగిన నిరసన అనంతరం చైర్‌పర్సన్ జామి హైమావతి కేసులో ఉన్న ఇద్దరు కౌన్సిలర్లు గేదల అప్పారావు, పడాల శ్రీనివాసరెడ్డి మాట్లాడి, కమిషనర్ కేసు ఉపసంహరించుకునేందుకు తనకు హామీ ఇచ్చారని, నిరసన విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీంతో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు అప్పారావు, శ్రీనివాసరెడ్డిలతో పాటు వైస్‌చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న నిరసన విరమించారు.